సాక్షి
అన్నమయ్య జిల్లా
మంగళవారం । 1 । జూలై । 2025



వైద్యుడు.. కనిపించే దేవుడు

తల్లి జన్మనిస్తే.. అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు వైద్యులు పునర్జన్మను ప్రసాదిస్తారు.నాడి పట్టి గుండె గుబుళ్లను గుర్తించి దిగులును దూరం చేసే కనిపించే దేవుడే వైద్యుడు. - 8లో



హోరాహోరీగా ఫుట్‌బాల్ పోటీలు

రాష్ట్ర స్థాయి బాలుర జూనియర్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు హోరా హోరీగా జరుగుతున్నాయి. సెమీ ఫైనల్స్‌లో 2-0తో సత్యసాయి జిల్లా జట్టు గెలుపొందింది. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.290	రూ.350
రెండోరకం	రూ.200	రూ.280

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1399 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

డెంగీ నివారణకు కృషి చేద్దాం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైద్యాధికారి తదితరులు

రాయచోటి టౌన్ : డెంగీ నివారణకు కృషి చేద్దామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎల్. లక్ష్మీనరసయ్య పిలుపునిచ్చారు. సోమవారం రాయచోటి జిల్లా వైద్యా ఆరోగ్యశాఖ కార్యాలయంలో జాతీయ డెంగీ వారోత్సవ పోస్టర్లు ఆవిష్కరించారు.అనంతరంమాట్లాడుతూ ఈడిస్ ఎజిప్టి దోమ కాటుతో డెంగీ వస్తుందన్నారు. దోమల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎంపీహెచ్ ఈఓవై శ్రీనివాసుల రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో ప్రారంభమైన అడ్మిషన్ల ప్రక్రియ

వేంపల్లె : వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీలో సోమవారం విద్యార్థులకు అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించారు. డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామి గుప్తా, పరిపాలన అధికారి రవికుమార్, డీన్ అకడమిక్ రమేష్ క్లాస్ ప్రారంభించారు. అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలం పెద్దవీడు గ్రామానికి చెందిన బి.మేఘన తొలి అడ్మిషన్ పొందగా.. సత్యసాయి జిల్లా బుక్కపట్నం గ్రామానికి చెందిన బి.హరీష్ రెండవ అడ్మిషన్, కర్నూలు జిల్లా దేవనకొండ మండలం అలారుదిన్నె గ్రామానికి చెందిన బి.మహేశ్వరి మూడవ అడ్మిషన్ పొందారు. డైరెక్టర్ కుమారస్వామి గుప్తా ఎంపికైన మొదటి, మూడు ర్యాంకుల విద్యార్థులకు ప్రవేశ పత్రాలతోపాటు బహుమతులను ప్రదానం చేశారు. తొలి రోజు 538 మందికి అడ్మిషన్లు పిలవగా, 481 మంది హాజరై అడ్మిషన్లను పొందారు.

వైఎస్సార్‌ను స్మరించుకున్న విద్యార్థులు

రాష్ట్ర నలుమూలల నుంచి అడ్మిషన్లు పొందేందుకు విద్యార్థులు వచ్చారు. ఈ నేపథ్యంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని వారు స్మరించుకున్నారు. ఆయన ఈ ట్రిపుల్‌ఐటీలను స్థాపించడం వల్లే తమ లాంటి పేద విద్యార్థులకు ఇలాంటి అవకాశం వచ్చిందన్నారు. ఆయనను ఎన్నటికీ మరువలేమన్నారు.

ప్రదక్షిణలు.. పడిగాపులు

- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పోటెత్తుతున్న బాధితులు
- కారణాలు ఏవైనా...దొరకని పరిష్కారం



ఒంటి కాలిపై నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ ఇంజనీరింగ్ కార్మికులు

సాక్షి రాయచోటి : సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు కష్టాలతోపాటు సమస్యలు పెరిగిపోయాయి. వైఎస్సార్ సీపీ హయాంలో వరుసపెట్టి ప్రతి నెలలోనూ సంక్షేమం అందుకుంటూ హాయిగా సాగిన ప్రజల జీవన ప్రయాణం కష్టంగా మారింది.కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ పథకాలను పూర్తి స్థాయిలో అందించకపోవడంతో అన్ని వర్గాలకు సంక్షేమం అందని ద్రాక్షగా మారింది. ఇదే తరుణంలో అధికార పార్టీ నాయకులకు ఇసుక, మద్యం షాపుల రూపంలో ఆదాయం ఒనగూరుతుండగా, ప్రజలకు సమస్యల తిప్పలు తిప్పడం లేదు. ప్రతినిత్యం ప్రజలు సమస్యలతో సతమతమవుతూ... పరిష్కారానికి దారి దొరకక అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అధికార పార్టీకి సంబంధించిన చోటామోటా నేతలు ఎక్కడికక్కడ ఖాళీ స్థలాలపై కన్నేయడం...ఖాళీగా ఉన్నాయి కదా అని కబ్జా చేయడం, ఎవరికీ తెలియకుండా ఆన్‌లైన్‌లో మార్పులు, చేర్పులకు తెర తీస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎక్కడికక్కడ సమస్యలు కూడా తాండవిస్తున్నాయి. ఆ సమస్యలకు పరిష్కారం చూపాలంటూ జిల్లా కేంద్రమైన రాయచోటిలోని కలెక్టరేట్‌కు పరుగులు పెడుతున్నారు.

సమస్యలతో కలెక్టరేట్‌కు బారులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వినతిపత్రాలతో బాధితులు పోటెత్తుతున్నారు. ఉరుకులు, పరుగులతో కలెక్టరేట్‌కు క్యూ కడుతున్నారు. దూర ప్రాంతాల నుంచి వ్యయ ప్రయాసలకోర్చి అధికారుల చెంతకు చేరుతున్నారు. సమస్యలు పరిష్కరించండి మహాప్రభో అంటూ మొర పెట్టుకుంటున్నారు. పెన్షన్ అందించాలని ఒకరు..రేషన్‌కార్డు ఇవ్వాలని మరొకరు...ఇల్లు ఎప్పుడొస్తారంటూ మరొకరు వరుసపెట్టి వస్తున్నారు. వికలాంగులు, వృద్ధులు పింఛన్ల కోసం కలెక్టరేట్ తలుపు తట్టడం కనిపిస్తోంది. తాగునీటి సమస్యతోపాటు ఔట్‌సోర్సింగ్ పద్ధతిన ఉపాధి కల్పించాలని పలువురు అధికారులను కలుస్తున్నారు. ప్రతి సోమవారం 350-400 మంది ప్రజలు వివిధ రకాల సమస్యలతో దూర ప్రాంతాల నుంచి ఇక్కడికి వస్తున్నారు.

ప్రభుత్వంపై పెరుగుతున్న వ్యతిరేకత

సమస్యలు అధికం కావడంతో ప్రజల్లో ప్రభుత్వం వ్యతిరేకత కూడా పెరుగుతోంది. వివిధ వర్గాల కార్మికులు రోడ్డెక్కుతున్నారు. సోమవారం వస్తేచాలు ప్రజా ఆందోళనలు అధికమవుతున్నాయి. ప్రభుత్వం పూర్తి స్థాయిలో హక్కుదారులకు న్యాయం చేయకపోవడంతో రోడ్డెక్కాల్సిన దుస్థితి నెలకొంది.

ఒంటికాలితో వినూత్న నిరసన

జిల్లా కేంద్రమైన రాయచోటిలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ ఇంజినీరింగ్ వర్కర్లు వినూత్న నిరసన చేపట్టారు. సోమవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వీవీ రమణ, రాయచోటి మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సంఘం అధ్యక్షుడు అక్బర్ అలీఖాన్ ఆధ్వర్యంలో కార్మికులు మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఒంటి కాలిపై నిలుచుని వినూత్న నిరసన చేపట్టారు. సుమారు 20 మంది కార్మికులు తొమ్మిది రోజులుగా రిలే దీక్షల్లో కూర్చొని తమ నిరసన తెలియజేస్తున్నారు. మున్సిపల్ పరిధిలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఇంజినీరింగ్ వర్కర్లకు తల్లికి వందనం అమలు చేయాలని, మట్టిఖర్చులు రూ. 20 వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈపీఎఫ్, ఈఎస్ఐలు సరిచేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటిని అమలు చేయాలని నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో దీక్షలు కొనసాగిస్తున్నారు.

ఆలయ నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలి

మదనపల్లె మండలం కోళ్లబైలు పంచాయతీ ఇందిరమ్మ కాలనీలో అభయ ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. పలు హిందూ సంఘాల ప్రతినిధులు కాషాయ జెండా చేతబూని ఆలయ నిర్మాణానికి రెవెన్యూ అధికారులు అడ్డు తగులుతున్నారని, వెంటనే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ శ్రీధర్‌కు వారు వినతిపత్రం సమర్పించారు.

ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి

ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించని పక్షంలో జులై 9 నుంచి సమ్మె బాట పట్టనున్నారు. అందుకు సంబంధించి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు సోమవారం సమ్మె నోటీసును జిల్లా వైద్యాధికారి లక్ష్మినరసయ్యకు ఆశా వర్కర్లతో కలిసి అందజేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్‌చేస్తూ సమ్మె బాట పట్టనున్నారు.

గిరిజనుల భూములను ఆక్రమించిన వారిపై చర్యలు చేపట్టాలి

గిరిజనుల భూములను ఆక్రమించిన వారిపై చర్యలు చేపట్టాలని సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. పెద్దమండ్యం మండలం బండ్రేవు గ్రామ పరిధిలోని అవికె నాయక్ తాండాలో 35 కుటుంబాలు నివసిస్తున్నాయని..వీరి పూర్వీకుల పేరుతో 102, 103 సర్వే నంబర్లలో ఉన్న 50 ఎకరాల భూమి వీరు సాగుచేసుకుంటున్నారన్నారు. అయితే గిరిజనుల భూములను కొందరు కబ్జా చేసి పట్టాలు పొంది ఆక్రమించుకున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

టీడీపీ నాయకుల దౌర్జన్యం

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తల పట్టా భూమి ఆక్రమణ
- రెవెన్యూ, పోలీసు కార్యాలయాల చుట్టూ తిరిగినా జరగని న్యాయం



సురేంద్రారెడ్డి పట్టా భూమిని ఆక్రమించి మామిడి మొక్కలు నాటి రాళ్లతో వేసిన కంచె

రాయచోటి : కూటమి ప్రభుత్వంలో భాగస్వాములైన టీడీపీ నాయకుల దౌర్జన్యాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ప్రభుత్వ భూ ఆక్రమణలే కాకుండా ప్రైవేట్ వ్యక్తులకు సంబంధించిన భూములను సైతం దౌర్జన్యంగా ఆక్రమించి సొంతం చేసుకుంటున్న ఉదంతాలు జిల్లాలో తరచూ జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో భూఆక్రమణలు వెలుగుచూస్తున్నాయి. గాలివీడు మండలం కొర్లకుంట పంచాయతీ చావిడిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పేరం సురేంద్రారెడ్డి పేరున ఉన్న 65 సెంట్ల పట్టా భూమిని టీడీపీ నాయకులు దౌర్జన్యంతో ఆక్రమించి కంచ వేసేశారు. గ్రామ పొలంలోని సర్వే నంబర్ 183/1లో 0.65 ఎకరాల పట్టా భూమిలో ఉన్న వేపచెట్లను నరికి తరలించుకుపోయారు. ఈ విషయంపై స్థానిక పోలీసు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. గత కొన్ని నెలలుగా సురేంద్రారెడ్డికి చెందిన నిమ్మతోటకు నీరు వేసుకోవడానికి కూడా ఇబ్బందులు పెడుతున్నారని జిల్లా కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. భూ ఆక్రమణల సమయంలో ఘర్షణకు దిగిన వైఎస్సార్‌సీపీ నాయకులపైన కేసులు బనాయించి ఆర్థికంగా మానసికంగా ఇబ్బందులు పెట్టాలన్న దురుద్దేశంతోనే స్థానిక నాయకులు ఇలాంటి దురాగతాలకు పాల్పడుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. సురేంద్రారెడ్డి భూమిలోని చెట్లను తొలగించి జేసీబీల సాయంతో భూమి అంతా చదును చేసి రాత్రికి రాత్రే మామిడిమొక్కలు నాటి ఆ పొలం చుట్టూ రాళ్లు నాటి కంచె వేశారు. భూఆక్రమణ సమయంలో స్థానికంగా ఉన్న టీడీపీ నేత తన అనుచరులతో కలిసి రెచ్చగొట్టే వ్యాఖ్యలు కూడా చేసినట్లు స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు తెలిపారు. ఈ భూమికి సంబంధించిన వన్-బి, అడంగల్, ఆర్‌హెచ్ నకల్ నమూనాలలో కూడా సురేంద్రారెడ్డి పేరున రికార్డు అయింది. స్థానిక టీడీపీ నాయకులు చేస్తున్న దౌర్జన్యాలు, ఆక్రమణల విషయంపై గాలివీడు తహసీల్దార్, పోలీస్‌స్టేషన్, జిల్లా కలెక్టర్ స్థాయి వరకు విన్నవించుకున్నా న్యాయం జరగడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు గ్రామాన్ని సందర్శించి భూమి రికార్డులను పరిశీలించి, గ్రామంలో నెలకొన్న పరిస్థితులపై అధ్యయనం చేసి బాధితులకు న్యాయం చేయాల్సిన అవసరం ఉంది.



పట్టా భూమిని చదును చేసిన దృశ్యం

అయ్యో దేవుడా.. ఎంతపనిచేశావయ్యా..

'దేవుడా ఎంత పని చేశావయ్యా.. మీ దర్శనం కోసం నిన్ను తలచుకుంటూ భయ భక్తులతో వచ్చాం.. మాపై దయలేదా.. రోడ్డు ప్రమాదంతో ఎంతో వేదన కలిగించే ఇలాంటి పరిస్థితి ఎదురైంది. చదువుకుంటున్న ఇద్దరు విద్యార్థులు తనువు చాలించారు.. ఇంకో గృహిణి విగత జీవిగా మారింది. మాకెందుకయ్యా. ఇంత వేదన బాధను ఇచ్చావంటూ' కన్నీరు మున్నీరవుతూ విలపించిన దృశ్యం చూపరుల హృదయాలను కలచి వేసింది.

- మాటలకు అందని విషాదం
- తిరుమల దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా ఘోర ప్రమాదం
- ముగ్గురి మృతితో గొల్లుమన్న బాగేపల్లె
- పది మందికి తీవ్ర గాయాలు



చెన్నామర్రి వద్ద హృదయ విదారక దృశ్యం



చరణ్ (ఫైల్)



మేఘర్ష్ (ఫైల్)



మృతి చెందిన చరణ్



మేఘర్ష్



శ్రావణి



శ్రావణి (ఫైల్)

కురబలకోట : అన్నమయ్య జిల్లా కురబలకోట మండలం చెన్నామర్రి మిట్ట వద్ద సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదం పెను విషాదాన్ని మిగిల్చింది. కర్నాటక రాష్ట్రం బాగేపల్లెకు చెందిన మూడు కుటుంబాల వారు డ్రైవర్‌తో కలిపి 15 మంది తిరుమల దైవ దర్శనానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ట్రావెల్ టెంపోలో స్వగ్రామానికి వస్తుండగా మండలంలోని చెన్నామర్రి వద్ద ఎదురుగా వచ్చిన కంటైనర్ లారీ ఢీకొనడంతో ఈ ఘోరం జరిగింది. మేఘర్ష్ (16), చరణ్ (17), శ్రావణి (24) అక్కడికక్కడే విగత జీవులుగా మారారు. మరో పది మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో నరసింహారెడ్డి (49), రూప (40) ఆదర్శ్ (19), రామచంద్రప్ప (45), కళావతి (40), దర్శన్ (16), శివప్ప(42), సునందమ్మ (38) చైత్ర (19) తోపాటు ట్రావెల్ టెంపో డ్రైవర్ మంజునాథ (42) ఉన్నారు. ఆర్తనాదాలు, విలాపాలతో సంఘటన స్థలం శోకతప్తమైంది.గుండెలవిసే వేదనలతో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రి నిండిపోయింది. కాళ్లు, చేతులు విరిగిన వారు, తలలు పగిలిన వారు ఇలా వివిధ రకాలుగా గాయాల పాలైన వారిని చూసి గుండె తరుక్కుపోయింది. విషాదంతో కర్నాటకలోని బాగేపల్లె, కొత్త ఉడుంపల్లె గొల్లు మన్నాయి. పెనుప్రమాదం సంభవించడంతో కురబలకోట, మదనపల్లె ప్రాంతాలు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డాయి. మృతి చెందిన ముగ్గురి మృత దేహాలను మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. గాయపడిన వారిని 108 వాహనం, పోలీసు వాహనంలో తరలించారు. డ్రైవర్ మంజునాథ తీవ్రంగా గాయపడడంతో మాట్లాడలేని పరిస్థితిలో ఉన్నారు. నరసింహారెడ్డి, శివప్ప కుటుంబాలకు చెందిన వారిని మెరుగైన వైద్యం కోసం కర్నాటక రాష్ట్రంలోని వివిధ ఆసుపత్రులకు తరలించారు. ఇదిలా ఉండగా ట్రావెలర్ టెంపోను ఢీకొని వెళ్లిపోయింది కంటైనర్ లారీగా గుర్తించారు. వాహనంతో పాటు డ్రైవర్ కోసం పోలీసులు విభిన్న కోణాల్లో ముమ్మరంగా గాలిస్తున్నారు. కొలిక్కి వచ్చినట్లు చెబుతున్నారు. రూరల్ సర్కిల్ సీఐ సత్యనారాయణ, ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ప్రమాదకర దృశ్యాలు హృదయ విదారకంగా మారాయి.

టాప్‌తో సహా లేచిపోయింది

ట్రావెలర్ టెంపో డ్రైవర్ పక్కగా ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో అటు వైపు ఉన్న వారు ముగ్గురు చనిపోగా పది మంది గాయపడ్డారు. లారీ వేగంగా ఢీకొట్టడంతో టెంపో ట్రావెలర్ వాహనం టాప్ ఏమాత్రం లేకుండా లేచిపోయింది. సీట్లలోనే తీవ్ర గాయాలతో పడిఉండటం చలింపజేసింది. మరికొందరు చెల్లా చెదురుగా రోడ్డుపై పడిపోయారు. పోలీసులు సకాలంలో స్పందించారు. స్థానికులు కూడా సహాయక చర్యలతో మానవత్వాన్ని చాటుకున్నారు.

ఒక్కో కుటుంబంలో ఒక్కరు..

రోడ్డు ప్రమాదంలో ఒక్కో కుటుంబానికి చెందిన ఒకరు మృతి చెందడం కలవరాన్ని కల్గిస్తోంది. బాగేపల్లె నుంచి నరసింహారెడ్డి, రామచంద్రప్ప, శివప్ప కుటుంబాల వారు తిరుమల యాత్ర వెళ్లారు. నరసింహారెడ్డి కుటుంబంలో అతని కుమారుడు మేఘర్ష్ (16), రామచంద్రప్ప కోడలు శ్రావణి (24), శివప్ప కుటుంబం నుంచి చరణ్ (17) మృతి చెందారు. వీరిలో శ్రావణికి ఐదేళ్ల క్రితం వివాహమైంది. మిగిలిన వారు విద్యార్థులు. బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు.

అదృష్టవంతులు



ప్రమాదానికి గురైన ట్రావెలర్ టెంపో డ్రైవర్ మంజునాథ పక్క సీట్లో బాగేపల్లెకు చెందిన అశోక్ (32) కూర్చున్నాడు. ఇతని వెనుక సీట్లో బాగేపల్లె దగ్గరున్న ఎ. కొత్తపల్లెకు చెందిన ఏడో తరగతి విద్యార్థి హేమంత్ కూర్చున్నారు. ఇతను ఒక్కడే తిరుమల గుండు చేయించుకున్నారు. వీరు డ్రైవర్‌కు ఎడమ పక్కన సీట్లలో ఉండడం వల్ల పెను ప్రమాదం నుండి తప్పించుకున్నారు. 15 మందిలో వీరిద్దరికి రక్త గాయాలు కాలేదు. అంత ప్రమాదంలో వీరు బతికి బట్టకట్టడం అదృష్టమేనని చెబుతున్నారు. పక్కనే ఉన్న డ్రైవర్ మంజునాథ తీవ్ర గాయాలతో కోమాలోకి వెళ్లారు. బెంగళూరు ఆసుపత్రికి తరలించారు. మూడు కుటుంబాలు విభిన్న వృత్తుల్లో ఉన్నారు. నరసింహారెడ్డి బాగేపల్లిలో డిష్ నిర్వహిస్తున్నారు. రామచంద్రప్ప ప్రొవిజినల్ స్టోర్, శివప్ప వ్యవసాయం చేస్తున్నారు.

క్లుప్తంగా

బస్సు ఢీ కొని యువకుడి మృతి



ప్రమాదంలో మృతి చెందిన గోపాల్

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలం ఎస్.ఉప్పరపల్లి వద్ద సోమవారం ఉదయం హైదరాబాదు నుంచి పాండిచ్చేరి వెళ్తున్న ట్రావెల్స్ బస్సు చెన్నై నుంచి ఎర్రగుంట్లకు పల్సర్ బైక్‌పై వెళ్తున్న బి.గోపాల్ (25)ను ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ లక్ష్మీప్రసాద్, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వివాహిత అదృశ్యం



మాధవి.(ఫైల్)

మదనపల్లె రూరల్ : వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ ఎరీషావలీ తెలిపారు. సుండుపల్లెకు చెందిన మాధవి(20)కి, పట్టణంలోని మారుతీనగర్‌కు చెందిన చేనేత కార్మికుడు విజయ్‌కుమార్‌తో పదినెలల క్రితం వివాహమైంది. ఆమె ఇంటి వద్దే ఉంటుండగా, భర్త విజయ్‌కుమార్ స్థానికంగా చేనేత పనులకు వెళ్లేవాడు. ఈనెల 26న ఉదయం 7 గంటలకు విజయ్‌కుమార్ పనులకు వెళ్లి పది గంటలకు టిఫిన్ చేసేందుకు ఇంటికి రాగా, భార్య మాధవి కనిపించకపోవడంతో ఆమె సెల్‌కు ఫోన్‌చేశాడు. సమాధానం రాకపోగా ఫోన్ స్విచ్ఆఫ్ రావడంతో పలుచోట్ల కుటుంబ సభ్యులతో కలిసి గాలించాడు. ఆచూకీ లభించకపోవడంతో సోమవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

కొండాపురం : మండల పరిధిలోని పాత తాళ్లప్రొద్దుటూరు గ్రామంలోని శివాలయంలో ఆదివారం రాత్రి గుప్త నిధుల కోసం గుర్తు తెలియని వ్యక్తులు తవ్వకాలు చేపట్టినట్లు స్థానికులు తెలిపారు. గండికోట జలాశయంలో ముంపునకు గురైన గ్రామాల్లో ఆలయాల్లో గుప్త నిధులు ఉంటాయని దొంగలు టార్గెట్ చేస్తున్నారు. పాత తాళ్లప్రొద్దుటూరు లోని శివాలయం గుడిలో శివ లింగం చుట్టు తవ్వకాలు చేపట్టడంతో సోమవారం మండల తహసీల్దార్ గుర్రప్ప, స్థానిక పోలీసులు పరిశీలించారు. ముంపు గ్రామాల్లో జనసంచారం లేకపోవడంతో పురాతన ఆలయాల్లో తవ్వకాలు జరుపుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వైద్యుడు.. కనిపించే దేవుడు

ఒక్కమాటలో చెప్పాలంటే వైద్యులు దేవుళ్లతో సమానం. మనిషి అనారోగ్యం బారిన పడిన సమయంలో వైద్యుడు చేసే సేవలు వెలకట్టలేనివి. తల్లి జన్మనిస్తే.. త్ర అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు, ప్రమాదాలు జరిగినప్పుడు, రిస్క్‌తో కూడిన శస్త్ర చికిత్సలు చేయాల్సి వచ్చినప్పుడు వైద్యులు పునర్జన్మను ప్రసాదిస్తారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆహారం, వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా వివిధ జబ్బులతో మనిషి బాధపడాల్సి వస్తుంది. రోగుల ప్రాణాలను కాపాడటమే లక్ష్యంగా వైద్యులు సేవలు అందిస్తున్నారు. అనేక మంది వైద్యులు మానవత్వంతో పేదలకు, అభాగ్యులకు వైద్యం అందించి వారి ప్రాణాలను నిలుపుతున్నారు. అందుకే వైద్యో నారాయణో హరి అంటుంటారు పెద్దలు. రోగి పరేషాన్‌కు ఏ ఆపరేషన్ చేయాలో వైద్యుడికే తెలుస్తుంది. నాడి పట్టి గుండె గుబుళ్లను గుర్తించి దిగులును దూరం చేసే కనిపించే దేవుడే వైద్యుడు.



- మీ సేవలకు వందనం
- రోగుల ప్రాణాలు కాపాడటంలో శక్తి వంచన లేకుండా శ్రమించే దేవుళ్లు
- నేడు డాక్టర్స్ డే

రాజంపేట టౌన్ : వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనది. అందువల్లే వైద్యులకు సమాజంలో ఎంతో గుర్తింపు, గౌరవం దక్కుతుంది. కొన్ని రకాల జబ్బుల బారిన పడిన వారి వద్దకు వెళ్లేందుకు కుటుంబ సభ్యులు కూడా భయపడుతుంటారు. అయితే అలాంటి రోగుల వద్దకు కూడా వెళ్లి వైద్యం చేసేది ఒక్క వైద్యుడు మాత్రమే. ప్రతి శాఖలో ఉద్యోగులకు, చివరికి దినసరి కూలీలకు కూడా సెలవులుంటాయి. కాని వైద్యులకు మాత్రం సెలవు ఉండదు. కొన్ని సందర్భాల్లో క్షణం తీరిక కూడా ఉండదు. పిల్లలతో, కుటుంబ సభ్యులతో సంతోషంగా గడిపేందుకు కూడా కొంత మంది వైద్యులకు సమయం ఉండదంటే అతిశయోక్తి కాదనే చెప్పాలి.

చేదు అనుభవాలు..

వైద్యులకు ఆదివారాలు ఉండవు. ఎమర్జెన్సీ కేసు వచ్చిందంటే ఎక్కడున్నా సరే పరిగెత్తుకుంటూ వెళ్లాల్సిందే. రోగి ప్రాణాలను నిలిపేందుకు వైద్యులు తమ జీవితాలను కూడా త్యాగం చేస్తుంటారు. అలాంటి వైద్యులకు ఒక్కో మారు చేదు అనుభవాలు సైతం ఎదురవుతుంటాయి. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు, ఆరోగ్య సమస్య తలెత్తినప్పుడు సరైన సమయానికి వైద్యుడి వద్దకు తీసుకురాలేక చివరి దశలో వైద్యుడి వద్దకు తీసుకొస్తే వైద్యుడు ఆ మనిషి ప్రాణాన్ని కాపాడేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తాడు. అయితే కొన్ని సందర్భాల్లో వైద్యుడు మనిషి ప్రాణాలను కాపాడలేక పోతాడు. ఆ సందర్భంలో మృతుని కుటుంబ సభ్యులు ముందూ వెనకా ఆలోచించకుండా ఆందోళనకు దిగడం, దాడులు చేయడం అక్కడక్కడా జరుగుతున్నాయి. ఇది చాలా బాధాకరమనే చెప్పాలి.

మానసిక ఒత్తిడి ఎక్కువే..

వైద్యులకు వ్యక్తిగత జీవితాల్లో మానసిక ఒత్తిళ్లు ఎక్కువే ఉంటాయి. వృత్తిలోని సాధకబాధకాలను అర్థం చేసుకోవాలనే ఉద్దేశంతో చాలా మంది వైద్యులు అదే వృత్తిలో ఉన్న వారిని తమ జీవిత భాగస్వామిగా ఎంచుకుంటారు. రోజంతా రోగుల సేవలో కనిపించే వైద్యులు వేడుకలు, పండుగల్లో కనిపించడం చాలా అరుదు. అందులో ఇబ్బందులున్నా ఎదుర్కొంటారు కాని ఇతరులకు చెప్పరు. అలాంటి వైద్యులను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది.

జగన్ హయాం నుంచి పల్లెలకు విస్తరించిన వైద్య సేవలు..

ఒకప్పుడు చిన్నపాటి జ్వరం, జలుబు వంటివి చేసినా గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఎంతో దూరంలో ఉండే పీహెచ్‌సీలకు లేకుంటే పట్టణ ప్రాంతాల్లో ఉండే ఆసుపత్రులకు వచ్చి వైద్య సేవలు పొందేవారు. అయితే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశ పెట్టిన 104 వాహనాల వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల ఇంటిముంగిటకే వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. 104 వాహనాల ద్వారా వైద్య సిబ్బంది నెలలో రెండు రోజులు మాత్రమే గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు అందిస్తారు. అయితే 2019వ సంవత్సరంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక సచివాలయాల వ్యవస్థ తీసుకొచ్చి ప్రతి సచివాలయంలో వైద్య సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకున్నారు. అందువల్ల గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఇప్పుడు వైద్య సేవలు నిత్యం అందుబాటులో ఉంటున్నాయి.

పేదల వైద్యుడు జీవీ సుబ్బారెడ్డి



రాజంపేట పట్టణంలో దాదాపు యాభై ఏళ్లుగా రోగులకు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ జీవీ సుబ్బారెడ్డి పేదల డాక్టర్‌గా గుర్తింపు పొందారు. నామమాత్రపు ఫీజుతో ఆయన మెరుగైన వైద్యం అందిస్తారు. అందువల్ల ఆయన వద్దకు ఇప్పటికీ పెద్దఎత్తున పేద ప్రజలు వైద్యం పొందేందుకు వస్తుంటారు. నామమాత్రపు ఫీజు కూడా ఇచ్చుకోలేని వారి వద్ద ఆయన ఒక్కపైసా కూడా తీసుకోకుండానే వైద్యం అందిస్తారు. అందువల్లే డాక్టర్ జీవీ.సుబ్బారెడ్డిని రాజంపేట ప్రాంత ప్రజలు పేదల డాక్టర్ అని ఎంతో అభిమానిస్తారు.

పూర్వజన్మ సుకృతం



వైద్యవృత్తిలో ఎంతో సంతృప్తి ఉంటుంది. రోగులకు వైద్య సేవలు అందించడం నా పూర్వ జన్మసుకృతంగా భావిస్తాను. నేను ఎంతో ఇష్టంగా ఈ వృత్తిని ఎంచుకున్నాను. అనేక సర్జరీలు చేశాను. సర్జరీలు విజయవంతంగా పూర్తి అయిన ప్రతిసారి ఎంతో ఆనందంగా ఉంటుంది. సమాజంలో ఎంతో గౌరవ మర్యాదలు ఉన్న ఈ వృత్తిలో నేను ఉండటం ఎంతో ఆనందంగా ఉంది.

– డాక్టర్ పాలనేని వెంకట నాగేశ్వరరాజు, సూపరింటెండెంట్, ప్రభుత్వ ఆసుపత్రి, రాజంపేట

వ్యక్తి ఆత్మహత్య

గుర్రంకొండ : ఆర్థిక సమస్యలతో చెట్టుకు ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని చెర్లోపల్లె పంచాయతీ సూరప్పగారిపల్లె వద్ద జరిగింది. పోలీసుల కథనం మేరకు సంబేపల్లె మండలం కొండావాండ్లపల్లెకు చెందిన కృష్ణారెడ్డి కుమారుడు కె.శ్రీనివాసులురెడ్డి(52)కి వివాహమైన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇద్దరు కుమార్తెలకు వివాహాలు జరిపించేశారు. గత కొంత కాలంగా ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న శ్రీనివాసులు రెడ్డి ఈనెల 27 ఇంటి నుంచి వచ్చేశాడు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు అతని ఆచూకి కోసం గాలించినా తెలియరాలేదు. సోమవారం మండలంలోని సూరప్పగారిపల్లెకు సమీపంలోని హంద్రీనీవా కాలువ పరిసరాల్లో ఓ చెట్టుకు మృతదేహం వేలాడుతోందని రైతులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారించారు. మృతుడు శ్రీనివాసురెడ్డేనని తేలడంతో అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ గజేంద్ర తెలిపారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ

బద్వేలు అర్బన్ : పట్టణంలోని నాలుగురోడ్ల కూడలిలో ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్ స్తంభాన్ని ఆదివారం అర్ధరాత్రి ఓ లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో మైదుకూరు రోడ్డు వైపున ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్ స్తంభంతో పాటు ట్రాఫిక్ సిగ్నల్స్ ధ్వంసమయ్యాయి. రేణిగుంట నుండి బద్వేలు మీదుగా గోపవరం సమీపంలోని సెంచూరి పరిశ్రమకు కలప లోడుతో వెళుతున్న లారీ ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఢీ కొట్టింది.

వేర్వేరు ఘటనల్లో ఆరుగురికి తీవ్ర గాయాలు



కారు అదుపుతప్పి తీవ్రంగా గాయపడిన పెద్దినాయుడు



ద్విచక్రవాహనం అదుపుతప్పి తీవ్రంగా గాయపడిన టైల్స్ కార్మికుడు అశోక్‌సహాని

మదనపల్లె రూరల్ : వేర్వేరు రోడ్డు ప్రమాద ఘటనల్లో ఆరుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడి మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ములకలచెరువు మండలం అడవిచెరువు గ్రామానికి చెందిన పెద్దినాయుడు(30), అమరనారాయణ(45), అతని భార్య అనూరాధ(40), ప్రతాప్‌నాయుడు(38) తిరుమల వెంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లి సోమవారం ఉదయం కారులో తిరిగి స్వగ్రామానికి వస్తుండగా, మార్గమధ్యంలోని చింతపర్తి సమీపంలో హైవే వద్ద వాహనం అదుపుతప్పి కల్వర్టులోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడగా, గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మదనపల్లె మండలం పోతబోలుకు చెందిన వెంకటరమణ కుమారుడు పి.గంగాద్రి(32) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం పుంగనూరు మండలం చంద్రమాకులపల్లె జెడ్పీహైస్కూల్ నుంచి ఉపాధ్యాయురాలిని తీసుకువచ్చేందుకు ద్విచక్రవాహనంలో వెళ్లాడు. మార్గమధ్యంలో ఓ ప్రైవేట్ స్కూల్ వ్యాన్ ఎదురుగా వచ్చి ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి కుడి కాలు విరిగింది. అదేవిధంగా బీహార్‌కు చెందిన టైల్స్ కార్మికులు అశోక్‌సహానీ(45) ములకలచెరువులో రూమ్ అద్దెకు తీసుకుని ఉంటూ పనులు చేసుకుంటున్నాడు. సోమవారం రూమ్ నుంచి పని ప్రదేశానికి ద్విచక్రవాహనంలో వెళుతుండగా, వాహనం అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. తలకు తగిలిన గాయంతో అపస్మారక స్థితికి వెళ్లాడు. దీంతో గమనించిన స్థానికులు బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



అలిశెట్టి లక్ష్మీదేవి (ఫైల్)

ఒంటిమిట్ట: మండలంలోని మల్లేశ్వరపురానికి చెందిన అలిశెట్టి లక్ష్మీదేవి (57) సోమవారం కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు జూన్ 14వ తేదీన అలిశెట్టి లక్ష్మీదేవి, ఆమె కుటుంబ సభ్యులు ఐదుగురు విద్యుత్ త్ వైర్ల విషయమై వారి దాయాదులైన మరో వర్గానికి చెందిన ఆరుగురితో ఘర్షణ పడ్డారు. జూన్ 14న ఇరువర్గాలు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. వారి మధ్య సఖ్యత కుదరకపోవడంతో జూన్ 28వ తేదీ రెండో వర్గంలోని 12 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇది ఇలా ఉండగా జూన్ 29వ తేదీన అలిశెట్టి లక్ష్మీదేవి అనారోగ్యంతో కడపలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేరగా అక్కడ ఆరోగ్య పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అలిశెట్టి లక్ష్మీదేవి మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఆమె చిన్న కూతురు శిరీషా జూన్ 14వ తేదీన జరిగిన ఘర్షణలో తన తల్లికి లోపల గాయాలు తగలడంతో ఆరోగ్యం క్షీణించి ఆసుపత్రి పాలై మృతి చెందినట్లు అనుమానంగా ఉందని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుమారుడితో సహా తండ్రి అదృశ్యం



మునిరత్నం, మనోజ్‌కుమార్ (ఫైల్)

మదనపల్లె రూరల్ : కుమారుడితో సహా తండ్రి అదృశ్యమైన ఘటనపై కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. మండలంలోని కొత్త ఇండ్లు రంగారెడ్డి కాలనీకి చెందిన నారాయణ కుమారుడు మునిరత్నం(42) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలం నుంచి మద్యానికి తీవ్రంగా బానిసై తరచూ భార్యతో గొడవపడేవాడు. ఈక్రమంలో ఒకసారి కుమార్తెను ఇంటి నుంచి తీసుకెళ్లిపోయాడు. కొద్దిరోజుల తర్వాత కూతురు ఇంటికెళ్లాలని పట్టుబట్టడంతో తీసుకువచ్చి ఇంటివద్ద దింపేశాడు. ఈ క్రమంలో ఈనెల 23న భార్య ఆదిలక్ష్మితో గొడవపడి కుమారుడు మనోజ్‌కుమార్(7)ను వెంటతీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు వారి ఆచూకీ కోసం పలుచోట్ల గాలించినా ఫలితం లేకపోవడంతో ఆదిలక్ష్మి సోమవారం తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఉపాధిలో అంతులేని అవినీతి

జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన వైఎస్సార్‌సీపీ నేతలు



జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు

రాయచోటి : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉపాధి హామీ పథకంలో అవినీతి అంతులేకుండా పోయిందని జిల్లాలోని ప్రజాప్రతినిధులు విమర్శించారు. వైఎస్సార్‌సీపీ పిలుపు మేరకు సోమవారం పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

డిమాండ్లు

- ఉపాధి హామీ పథకంలో చోటు చేసుకుంటున్న అవినీతిపై కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు జరిపించాలి
- రైతు, కూలీ శ్రామికుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత కేంద్రానిదని స్పష్టం చేశారు.
- ఉపాధి హామీ పనులను గ్రామ పంచాయతీల ద్వారానే నిర్వహించి కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లించాలి.
- సర్పంచులకు తల్లికి వందనం పథకం తక్షణమే వర్తింప చేయాలి
- కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1150 కోట్లు స్థానిక సంస్థలకు బకాయి లేకుండా తక్షణమే జమ చేయాలి.
- జీఓ ఎంఎస్ 11ను రద్దు చేసి, గాలిలో తేలుతున్న 1350 మంది పంచాయతీ సెక్రటరీలకు నియామకాలు చేపట్టాలి. 10 నెలలుగా వేతనాలు లేకుండా బాధపడుతున్న వారి జీతాలను వెంటనే విడుదల చేయాలి.
- స్థానిక సంస్థల బలోపేతం కోసం జడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్, ఎంపీటీసీల గౌరవ వేతనాలను పెంచి, వాయిదా లేకుండా చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో రాయచోటి నియోజకవర్గ పంచాయతీ వింగ్ అధ్యక్షుడు మాసన వెంకటరమణ, రాష్ట్ర పంచాయతీ విభాగ సెక్రటరీ గాలివీటి ప్రవీణ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీ సూరం వెంకటసుబ్బారెడ్డి, మేధావుల ఫోరం నియోజకవర్గ అధ్యక్షుడు జానం రవీంద్ర, కోడూరు పంచాయతీరాజ్ అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, రాజంపేట పంచాయతీరాజ్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి, కౌన్సిలర్ సుగవాసి ఈశ్వర్‌ప్రసాద్, వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు గువ్వల బుజ్జిబాబు, సర్పంచ్ రామాంజులు, హరినాథరెడ్డిలతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం తగదు

పోలీసు అధికారులను ఆదేశించిన జిల్లా ఎస్పీ



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందుతున్న ప్రజల ఫిర్యాదుల పట్ల అలసత్వం చేయరాదని జిల్లా పోలీసు యంత్రాంగాన్ని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశించారు. రాయచోటిలోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజల సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడారు. సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని, బాధితులకు చట్ట పరిధిలో తక్షణ న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు.

హోరాహోరీగా ఫుట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలు



సత్యసాయి, అనంతపురం జిల్లా జట్ల మధ్య హోరాహోరీగా జరుగుతున్న పోటీలు

మదనపల్లె సిటీ : రాష్ట్ర స్థాయి బాలుర జూనియర్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు హోరా హోరీగా జరుగుతున్నాయి. మదనపల్లె సమీపంలోని వేదా పాఠశాలలో సోమవారం వివిధ జిల్లాల జట్ల మధ్య పోటీలు నిర్వహించారు. సెమీ ఫైనల్స్‌లో సత్యసాయి–అనంతపురం జిల్లా జట్లు పోటీపడగా 2–0 స్కోరుతో సత్యసాయి జిల్లా జట్టు విజయం సాధించింది. మరో సెమీ ఫైనల్స్‌లో తిరుపతి–విశాఖపట్నం జట్లు పోటీ పడగా 7–4 స్కోరుతో తిరుపతి జట్టు గెలుపొందింది. ఫైనల్స్‌కు సత్యసాయి, తిరుపతి జట్లు చేరాయి. మంగళవారం తిరుపతి–సత్యసాయి జట్ల మధ్య పోటీ జరగనుంది. పోటీలను ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దిలీప్ కుమార్, మురళీధర్, మహేంద్ర, సిరాజ్, ఇర్షాద్, బాలాజీ, పవన్, చినబాబు పర్యవేక్షించారు.

కార్మిక వేతన భారం మేం భరిస్తాం

రాష్ట్రంలో మొదట స్పందించిన మదనపల్లె మున్సిపాలిటీ



చైర్మన్, కౌన్సిలర్లకు కృతజ్ఞతలు తెలుపుతున్న కార్మికులు

మదనపల్లె : రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో పని చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు తమ సమస్యలపై రెండునెలలుగా ఆందోళనలు, దీక్షలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్మికుల సమస్యలు తీరుస్తామని హామీ ఇచ్చినా పట్టించుకోవడం లేదు. దీంతో రాష్ట్రంలో మొట్టమొదటగా అన్నమయ్యజిల్లా మదనపల్లె మున్సిపల్ కౌన్సిల్ స్పందించింది. మదనపల్లె మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు 27 రోజులుగా దీక్షలు చేస్తున్నా స్థానిక టీడీపీ ఎమ్మెల్యేకాని, ఆ పార్టీ నేతలు కాని పట్టించుకోలేదు. కనీసం పరామర్శించి డిమాండ్లు ఏమిటో అడిగింది లేదు. కార్మికుల సమస్యలపై మానవీయ కోణంలో మున్సిపల్ కౌన్సిల్ స్పందించింది. సోమవారం సాయంత్రం నిర్వహించిన అత్యవసర కౌన్సిల్ సమావేశం సందర్భంగా కార్మికులు హాలు ముందు బైఠాయించారు. వారు డిమాండ్ చేస్తున్న వేతనాలపై వైస్ చైర్మన్ జింకా చలపతి, కౌన్సిలర్ ప్రసాద్‌లు సమావేశంలో చర్చించారు. మున్సిపాలిటీ తరపున వ్యత్యాస వేతనం చెల్లించేందుకు మున్సిపాలిటీ సిద్ధంగా ఉందని ప్రకటించారు. ఇప్పుడు చెల్లిస్తున్న వేతనానికి ఎంత అదనంగా అడుగుతున్నారో ఆ మొత్తాన్ని మదనపల్లె మున్సిపల్ సాధారణ నిధుల నుంచి చెల్లిస్తామని ప్రకటించి ఈ మేరకు తీర్మాణం చేస్తున్నట్లు ప్రకటించారు.

సేవలకు ప్రతిరూపం పదవీ విరమణ



పదవీ విరమణ పొందిన వారిని సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

రాయచోటి : రెవెన్యూ శాఖలో సుదీర్ఘ కాలం పాటు విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ పొందడం వారి సేవలకు ప్రతి రూపమని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ అన్నారు. సోమవారం పదవీ విరమణ పొందిన మదనపల్లి హెచ్ఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్ర, ల్యాండ్ సెక్షన్ సూపరింటెండెంట్ దైవాదీనంలను కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లా కలెక్టర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీ, పదవీ విరమణలు సర్వసాధారణమన్నారు. రెవెన్యూ శాఖలో సుదీర్ఘకాలంపాటు విధులు నిర్వర్తించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్ రావు, రాయచోటి ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ నరసింహ కుమార్, వివిధశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి



సాయి ప్రకాష్ (ఫైల్)

ఒంటిమిట్ట : గత నెల 24వ తేదీ ఒంటిమిట్ట కోదండరామస్వామి కల్యాణ వేదిక వద్ద కడప–చెన్నై జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, చికిత్స పొందుతున్న సాయి ప్రకాష్ (25) సోమవారం మృతి చెందాడు. పోలీసు వివరాల మేరకు జూన్ 24వ తేదీన మంత్రాలయం నుంచి కడప వైపు వెళ్తున్న సాయి ప్రకాష్ ద్విచక్ర వాహనానికి రాజంపేట వైపు వస్తున్న ద్విచక్ర వాహనం ఎదురుగా రావడంతో రెండు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో సాయి ప్రకాష్ తలకు తీవ్ర గాయం కావడంతో కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడి నుండి మెరుగైన చికిత్స కోసం సోమవారం కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు సాయి ప్రకాష్ తండ్రి నాగేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుళ్లు..గోపురాలు చూసేందుకు వచ్చాం



కారు వద్ద చీఫ్ ఇంజినీర్

పెద్దతిప్పసముద్రం : ఏదో గుళ్లు, గోపురాలు చూసేందుకు వచ్చాం..ఇదేం అధికారిక కార్యక్రమం కాదు అని తెలుగు గంగ ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ వరప్రసాద్ వ్యాఖ్యానించారు. సోమవారం ఆయన వెంట 12 వాహనాల్లో ఎస్ఈ, ఈఈ, డీఈలు, కాంట్రాక్టర్లతో కలసి పెద్దతిప్పసముద్రంలోని హంద్రీనీవా కాలువ పంప్ హౌస్‌కు విచ్చేశారు. కాంట్రాక్టర్ క్యాంపు వద్దకు వెళ్లారు. కాలువ పనులను పరిశీలించారు. అంతమంది అధికారులతో వచ్చిన సీఈని కలిసిన మీడియా ప్రతినిధులు ఆకస్మిక పర్యటన వివరాలను తెలియజేయాలని కోరారు. మీరు రాసుకునే అంత వివరాలైతే ఏం లేవు, ఏదో గుళ్లు, గోపురాలను చూడటానికి వచ్చామని సమాధానం ఇచ్చారు. ఒక మంత్రి లేదా ఒక ఎమ్మెల్యే పర్యటన లాగా కాన్వాయ్‌ను తలపించేలా 12 వాహనాల్లో హెచ్ఎన్ఎస్ఎస్ అధికార బృందం రావడం వివరాలను గోప్యంగా ఉంచడం వెనుక మతలబు ఏమిటో అధికారులకే ఎరుక. అధికారులు పర్యటించిన ప్రాంతంలో సీఈ చెప్పినట్టు గుళ్లు, గోపురాలు లేవు. కరువుతో బీళ్లు వారిన పొలాలు, పారని హంద్రీనీవా పుంగనూరు ఉపకాలువ కనిపిస్తాయి. గుళ్లు, గోపురాలు లేని కాంట్రాక్టర్ క్యాంపు వద్దకు ఎందుకు వెళ్లారు. ఆయన వెంట అధికారుల బృందం ఎందుకొచ్చిందో ఆయనే చెప్పాలి.